A1TV NEWS
# ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంచిక :01 సంపుటి : 34 ఆదివారం, 30, జూలై ,2023 పేజీలు 4. వేల :4 /

## భారతీయభాషలు ఎంతో పరిపుష్టమైనవి

### -ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ




న్యూఢిల్లీ,జూలై29 :
మన దేశంలో పరిపుష్టమైన, సౌభాగ్యవంతమైన భాషలు అనేకం ఉన్నాయని, అయితే అవి ప్రగతి నిరోధక భాషలనే ముద్ర వేశారని, ఇంత కన్నా దురదృష్టం వేరొకటి ఉంటుందా? అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. జాతీయ విద్యా విధానం , 2020 మూడో వార్షికోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ప్రగతి మైదానంలో శనివారం ఆయన ఆలిండియా ఎడ్యుకేషన్ కన్వెన్షన్‌ను ప్రారంభించారు. ఆంగ్లంలో మాట్లాడటం రానివారి ప్రతిభను ఎన్నడూ ఆమోదించేవారు కాదన్నారు. గ్రామీణ ప్రాంతాలవారు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొన్నారని తెలిపారు. తాను ఐక్య రాజ్య సమితిలో కూడా భారతీయ భాష హిందీలోనే మాట్లాడతానని చెప్పారు. జాతీయ విద్యా విధానంలో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల దేశానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. భాషలతో విద్వేష వ్యాపారాలు చేసేవారి షట్టర్లు మూతపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో జరిగింది. అఖిల భారతీయ శిక్షా సమాగమం పేరుతో శని, ఆదివారాల్లో ఈ కన్వెన్షన్ జరుగుతుంది. విద్యావేత్తలు, సబ్జెక్ట్ నిపుణులు, విధాన నిర్ణేతలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## ఇస్రో మరో ప్రయోగం

### – నింగిలోకి వాణిజ్య రాకెట్లు



సూళ్లూరుపేట,జూలై29 :
తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఇస్రో మరో వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 6:31 గంటలకు మొదటి ప్రయోగ వేదిక నుంచి పిఎస్ఎల్‌వి సి–56 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన డిఎస్–సార్ అనే ఉపగ్రహంతో పాటు మరో ఆరు నానో ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇస్రో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. సింగపూర్‌కు చెందిన వివిధ ప్రయివేటు కంపెనీలకు సంబంధించిన నానో ఉపగ్రహాలలో వేలోక్స-ఎఎం, ఆర్కేడ్, స్కూబీ, న్యూ లైన్, గాలాసియా–2, ఓఆర్‌బి–12, స్ట్రీడర్ ఉపగ్రహాలు ఉన్నాయి. పిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది 58వ ప్రయోగం. ఇప్పటి వరకూ 92 రాకెట్లను, 34 దేశాలకు చెందిన 424 ఉపగ్రహాలను వాణిజ్య పరంగా ప్రయోగించింది. కౌంట్‌డౌన్‌ను శనివారం ఉదయం 5.10 నిమిషాలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6.31నిమిషాలకు రాకెట్ ప్రయోగం జరగనుంది.



## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

శ్రీశైలం,జూలై29 )
:ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా వస్తున్నది. శనివారం ఉదయం నుంచి జూరాల ప్రాజెక్టు క్రస్ట్ గేట్లద్వార 1,19,070 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తిద్వారా మరో 29,805 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది. అలాగు సుంకేసుల నుంచి 2,181 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది. ప్రస్తుతం సాయంత్రం వరకు 92,511 క్యూసెక్కుల వరద రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నది. లాశయంలో నిల్వ 825.90 అడుగులుగా నమోదైంది. అదే విధంగా ఏపీ పవర్‌హౌస్, టీఎస్ పవర్‌హౌస్‌లో విద్యుదోత్పత్తికి సిద్ధంగా ఉన్నట్లు అధికారుల తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 837.90 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు.. కాగా ప్రస్తుతం 58.81 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆదివారం ఉదయం నుంచి ఎగువ నుంచి మరింత వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## తెలుగునేలకు జలహారం యాత్ర

### - ఆగస్ట్ 1 నుంచి చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన



అమరావతి,జూలై29( :
రానున్న ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వైసీపీ ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రానివ్వకూడదని.. చంద్రబాబు ప్రాజెక్టుల యాత్రచేపట్టబోతున్నారు. ఇప్పటికే రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో వైసీపీ పరిస్థితేంటో తేల్చడానికి మాజీ సీఎం చంద్రబాబు పక్కా ప్రణాళికతోల ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఆగస్టు1 నుంచి సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. 'తెలుగు నేలకు జలహారం'పేరుతో 'పెన్నా టూ వంశధార' వరకు రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు పర్యటించనున్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులను క్షేత్ర స్థాయిలో చంద్రబాబు, టీడీపీ నేతలు పరిశీలించనన్నారు. ఈ జలహారం యాత్ర కర్నూలు జిల్లాలో మొదలై నుంచి శ్రీకాకుళం వరకు సాగనున్నది. పెన్నా నుంచి వంశధార వరకు ఉన్న కీలక ప్రాజెక్టు పనులను బాబు పరిశీలించనున్నారు. ఇరిగేషన్ రంగంలో జగన్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ రోడ్ షోలు, సభలు నిర్వహించేందుకు టీడీపీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర స్వరూపాన్ని మార్చే నదుల అనుసంధానం ప్రక్రియకు జగన్ ప్రభుత్వం చేసిన నష్టంపై ప్రశ్నిస్తూ చంద్రబాబు పర్యటన జరగనున్నది.ఆగస్టు1న కర్నూలు జిల్లా నుంచి చంద్రబాబు యాత్ర ప్రారంభం కానుంది. మొదటి నాలుగు రోజుల్లో కర్నూలు, కడప, అనంతపురం చిత్తూరు జిల్లాల్లో ముఖ్యమైన ప్రాజెక్టులను బాబు సందర్శించనున్నారు. ఇలా చేయడంతో ఇరిగేషన్ రంగాన్ని, ప్రాజెక్టులను జగన్ ఏవిధంగా భ్రష్టు పట్టించారనే విషయాన్ని జనాల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది.

## జగన్ పాలన చూసి ఓర్వలేకపోతున్నారు

### -పురందేశ్వరి వ్యాఖ్యలపై బొత్స రియాక్షన్



ఏపీ బీజేపీ పగ్గాలు అందుకున్న దగ్గుబాటి పురందేశ్వరి వైసీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందంటూ పురందేశ్వరి చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు.ఏపీలో జగన్ పాలన చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని బొత్స మండిపడ్డారు. జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పురందేశ్వరికి కనిపించడంలేదా... అవన్నీ వదిలేసి ఏపీ అప్పుల్లో ఉందని వ్యాఖ్యానించడం సమంజసమేనా? అని బొత్స ప్రశ్నించారు.ఓ బీజేపీ ఎంపీ పార్లమెంటులో మాట్లాడుతూ, అప్పుల్లో ఏపీ ఏడో స్థానంలో ఉందని చెబుతున్నాడు... మరి మిగిలిన ఆరు రాష్ట్రాల గురించి మీరు ఎందుకు మాట్లాడడంలేదు? బీజేపీ పాలిత రాష్ట్రాల అప్పుల గురించి ఎందుకు మాట్లాడరు? అంటూ బొత్స నిలదీశారు.
ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిశ్రమ గురించి ఒక్క మాట మాట్లాడకుండా, ఇలా అప్పుల గురించి మాట్లాడడం సరికాదు అంటూ వ్యాఖ్యానించారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన సందర్భంగా మంత్రి బొత్స ఈ వ్యాఖ్యలు చేశారు

## త్వరలోనే భారత్ జోడో యాత్ర 2.0..

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికలే టార్గెట్ గా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'భారత్ జోడో యాత్ర' పేరుతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు పాదయాత్ర చేసిన ఆయన.. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో 'యాత్ర 2.0' మొదలుకానుందని కాంగ్రెస్ విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.భారత్ జోడో యాత్ర నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ హెడ్ దిగ్విజయ్ సింగ్.. రెండో విడత యాత్ర కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. గత వారం నుంచి పలువురు పార్టీ కీలక నేతలతో యాత్ర గురించి ఆయన చర్చలు జరుపుతున్నారు. చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని.. యాత్ర 2 ప్రారంభ తేదీ, రూట్‌మ్యాప్ మీద ఇంకా చర్చలు జరపాల్సి ఉందని ఏఐసీసీ మెంబర్ ఒకరు చెబుతున్నారు.భారత్ జోడో యాత్ర 2022 సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి ప్రారంభమై.. 2023 జనవరి 30న శ్రీనగర్‌తో ముగిసింది. యాత్రను ప్రారంభించడానికి ముందు అహ్మదాబాద్‌లోని మహాత్మాగాంధీ స్మారకం వద్ద రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. దీంతో గాంధీ జన్మస్థలమైన పోర్‌బందర్ నుంచి రెండో విడత యాత్ర మొదలుపెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. పోర్‌బందర్ నుంచి పలు రాష్ట్రాల గుండా అగర్తలాతో యాత్ర ముగిసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని భావిస్తోంది.



# మానవ అక్రమ రవాణా బాధిత మహిళలకు ఆర్థిక సామాజిక సాధికారతను అందించాలి - విముక్తి డిమాండ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 29:

విజయవాడ, జుల్కై 29: మానవ అక్రమ రవాణా మరియు వ్యాపార ల్కైంగిక దోపిడికి గురైన బాధితులను పునరావాసం, సాధికారత పేరుతో జైళ్ళను తలపించే "షెల్టర్ హోమ్"ల్లో నెలలు, సంవత్సరాల తరబడి నిర్బందించకుండా వారికి "కమ్యూనిటి ఆధారిత పునరావాసాన్ని" కల్పించి ఆర్థిక, సామాజిక సాధికారతను అందించాలని అక్రమ రవాణా బాధితుల రాష్ట్ర వేదిక "విముక్తి" అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమతి అపూర్వ, శ్రీమతి పుష్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

"ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం" పురస్కరించుకొని విముక్తి నాయకులు శనివారం స్థానిక ప్రస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి "అక్రమ రవాణా బాధితులు అందరిని, ఒక్కరిని కూడా ఒదలకుండా మద్దతు ఇవ్వాలి" అనే నినాదంతో ఈ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంను ప్రకటించాయని, ఈ సందర్భంగా అయినా బాధిత మహిళలు అందరికి కమ్యూనిటి ఆధారిత పునరావాసం కల్పించి, నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు విముక్తి నాయకులు తెల్పారు. 2015 నుంచి 2021 వరకు జాతీయ నేర గణాంకాల శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో షుమారు 2,500 మంది బాదితులను అక్రమ రవాణా నుంచి విముక్తి కలిగించారని అయితే వారిలో 15 మందికి మాత్రమే నల్సా పథకం క్రింద నిర్భయ ఫండ్ ద్వారా నష్టపరిహారం అందిందని, అలాగే 2,500 మందిలో కనీసం 20 శాతం మందికి కూడా జివో నెం: 1/2003 క్రింద సామాజిక హక్కులుతో పాటు, పునరావాస పథకాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.




అక్రమ రవాణా బాధిత మహిళలును పునరావాసం, కౌన్సిలింగ్ లేదా వృత్తి శిక్షణలు పేరుతో జైళ్ళను తలపించే షెల్టర్ హోమ్‌లలో నెలలు, సంవత్సరాలు నిర్బందించి ఒక ట్కైంటేబుల్‌ను అనుసరించాలని బాధితులు కోరుకోవడం లేదన్నారు. ఇందుకు ప్రతిగా బాధితుల హక్కులు గౌరవిస్తూ వారికి "కమ్యూనిటి ఆధారిత పునరావాసం" పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని విముక్తి అధ్యక్షురాలు శ్రీమతి అపూర్వ కోరారు.

విముక్తి రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి పుష్పావతి మాట్లాడుతూ భారత దేశంలో ప్రస్తుతం ఉన్న అక్రమ రవాణా వ్యతిరేక విధానం, చట్టాలు "అక్రమ రవాణాకు గురైన బాధితులను రక్షించడం మరియు నేరస్థులను విచారించడం పైనే దృష్టిపెడుతుంది గాని, బాధితుల రక్షణ, వివక్షత, బాధితుల పునరావాసం, నష్ట పరిహారం అందించడంపై దృష్టి పెట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

భారతదేశంలో అక్రమ రవాణా ఎదుర్కోవడానికి ఐ.టి.పి యాక్ట్, బాండెడ్ లేబర్ యాక్ట్, 370 ఐ.పి.సి సెక్షన్ మాత్రమే ఉన్నాయి. అయితే ఈ చట్టాలు, సెక్షన్లు, బాధిత మహిళలకు పునరావాసం గురించి అలాగే ప్రభుత్వ సంస్థలు ద్వారా వారిని ప్రధాన స్రవంతిలో ఎలా కలపాలి, ఏయే సేవలు వారికి అందించాలో ఎక్కడ వివరించక పోవడం ఈ సమస్యకు మూల కారణం అని విముక్తి నాయకులు పేర్కొన్నారు.

ట్రాఫికర్లు 15 రోజుల్లోనే బెయిల్‌పై వచ్చి రోడ్లపై తిరుగుతుంటే అక్రమరవాణా బాధిత మహిళలను "పునరావాసం" పేరిట "షెల్టర్ హోమ్" లలో నెలల తరబడి నిర్బందించి చివరకు వట్టి చేతులతో వారి ఇళ్ళకు తరలిస్తున్నారు. కాని సమాజంలోకి వీరు వచ్చిన తర్వాత పునరావాసం, నష్టపరిహారం అందక, మరో ప్రక్క షెల్టర్ హోమ్‌లలో నేర్చుకొన్న అరకొర కొద్దిపాటి వృత్తి నైపుణ్యాలు వారికి ఉపాధి కల్పించలేక, సమాజంలో వివక్షత, చిన్న చూపు, మరోప్రక్క కుటుంబ పేదరికం వల్ల తిండి కోసం చాలా మంది బాధితులు "సెక్స్ వర్కర్లు"గా మారవల్సిన దుస్థితి ఏర్పడిరదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

పునరావాస కల్పనపై ప్రభుత్వ విధి విధానాలు లేవు రాష్ట్రంలో అక్రమ రవాణా భాదిత మహిళలుకు పునరావాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలు లేనందున గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు వరకు వీరికి ఏమి చేయాలి, ఎలా చేయాలి, ఎవరి ద్వారా చేయాలి అనే అంశం పై ప్రభుత్వ విధి విధానాలు లేనందున వారిలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది అని విముక్తి ఉపాధ్యక్షురాలు శ్రీమతి బాజీవలి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ఉదాహరణ గా బాధిత మహిళలు తమకు పునరావాసం క్రింద జీవనోపాదులు, గృహాల నిర్మాణం, ఆర్థిక సహాయం తోపాటు వివిధ పునరావాస పథకాలు అందించాలని గ్రామ సచివాలయాలు, మండల, జిల్లా స్థాయి అధికారులకు దరఖాస్తులు పెట్టుకొంటే అక్రమ రవాణా బాధిత మహిళలకు పునరావాస కార్యక్రమాలు కల్పనకై ప్రభుత్వం నుంచి ఎటువంటి విధివిధానాలు లేనందున మేము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారని ఆమె అన్నారు.

ఇప్పటికి అయినా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అక్రమ రవాణా బాధిత మహిళల కోసం "కమ్యూనిటి ఆధారిత పునరావాసం" పాలసి రూపొందించి గ్రామస్థాయి సచివాలయాల ద్వారా అవి అమలు చేయాలని విముక్తి సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ సమావేశంలో విముక్తి నాయకులు శ్రీమతి బాజీవలి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పని అయిపోయింది...రాబోయేది మనమే!




ఆంధ్ర ప్రగతి పర్చూరు జూలై 29:

ఎండా,వానను తట్టుకుని 2200 కి.మీ. పాదయాత్ర పూర్తిచేశాను, 5కోట్లమంది ప్రజల ఆశీస్సులు, టిడిపి కుటుంబసభ్యుల ప్రోత్సాహమే నన్ను ముందుకు నడిపిస్తోందని టిడిపి యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. గుండ్లాపల్లి క్యాంప్ సైట్ లో పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో యువనేత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... టీడీపీ కార్యకర్తలకు ఇబ్బంది వస్తే నేరుగా పార్టీనే స్పందిస్తోంది. ఏ పార్టీ చేయని విధంగా కార్యకర్తలకు సంక్షేమ నిధితో పాటు బీమా కల్పించాం. జిల్లాలో పెద్దాయన అని చెప్పుకుని తిరిగిన వ్యక్తి పార్టీ మారారు... కానీ కార్యకర్తలు మారలేదు. నాయకులు వస్తూ పోతుంటారు, కార్యకర్తలే శాశ్వతం. గత నాలుగేళ్లలో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు...అక్రమ కేసులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం సరైన దారిలో లేదు. రాబోయే తరాలు బాగుండాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలి. మొదట టీడీపీ శ్రేణులపై దాడులు చేశారు, తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు చేశారు, ఇప్పుడు ఏకంగా పోలీసులపై కూడా దౌర్జన్యాలు చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా తొమ్మిది నెలల సమయం ఉంది. అందరం కలసి పోరాడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. పని చేసేవాళ్లను ప్రోత్సహిస్తా. మన బూత్..మన భవిష్యత్ కార్యక్రమం ద్వారా అందరూ ప్రతి బూత్ వారీగా పార్టీకి మెజార్టీ తీసుకురండి, మీ భవిష్యత్ నేను చూసుకుంటా.

పర్చూరులో మళ్లీ పసుపుజెండా ఎగరాలి!

పర్చూరులో మళ్లీ టీడీపీ జెండా ఎగరాలి..ఏలూరి సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలి. ప్రభుత్వ ఎదురుదాడులను పర్చూరు ప్రజలు ఎదుర్కొన్నారు. పర్చూరు ప్రజలు చాలా తెలివైన వాళ్లు. ఈసారి మనం గెలుపుపై కాదు..మెజారిటీపై దృష్టి సారించాలి. క్లస్టర్, బూత్, యూనిట్, మండల అధ్యక్షులు కలసి పని చేయాలి. వారానికి 5 రోజులు... రోజుకు 2 గంటలు కష్టపడండి. విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీలు, పెట్రోల్, గ్యాస్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయి. సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందడం లేదు.

ప్రతిగడప తలుపుతట్టండి!

మనం మహాశక్తి కార్యక్రమం తీసుకొచ్చాం... అధికారంలోకి వచ్చిన యేడాదిలో అమలు చేస్తాం. ప్రతి ఇంటి తలుపు తట్టండి..చివరి ఓటు పడే వరకూ కాపలా కాయాలి. నేను పాదయాత్ర ప్రారంభించినప్పుడు అడ్డుకుంటామని అన్నారు... కానీ కార్యకర్తలు వైసీపీ వాళ్లకు బుద్ధి చెప్పారు. పలానా వ్యక్తి ఓటే వేయరు అని అనుకోవద్దు..ఒకటికి పదిసార్లు తిరగండి. మంగళగిరిలో ఓడిపోయానని నేను వదిలి వెళ్లలేదు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నాను. మిమ్మల్ని అక్రమంగా ఇబ్బంది పెట్టిన వారిని నేను వదిలిపెట్టను. మీకు ఏలూరి సాంబశివరావు అండగా ఉంటాడు. ఈ 9 నెలల సమయం చాలా కీలకం. జగన్ పనైపోయిందన్న భావనలో వైసీపీ కార్యకర్తలున్నారు. జగన్ తీరు నచ్చక టీడీపీకి ఓటేయడానికి వైసీపీ కార్యకర్తలు కూడా సిద్ధంగా ఉన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి జగన్ అరాచకపాలనపై చైతన్యం తీసుకురండి



## దూదెకొండ గ్రామం, పత్తికొండ మండలం నుండి.

### - గోవు భారత జాతి అపురూప సంపద.

ఆంధ్ర ప్రగతి పత్తికొండ జులై 29:

తల్లి తర్వాత అంతటి స్థానాన్ని పొందిన జీవి గోవు అని, అందుకే గోవును గోమాతగా భారతీయులచే పూజించబడే గోజాతిని సంరక్షించుకోవలసిన అవసరం ప్రతి వ్యక్తిపై ఉన్నదని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి పిలుపునిచ్చారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా కుంకుమార్చనతో పాటు గోమాతకు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవు జీవితాన్ని చాలించేలోపు మానవజాతికి మహోపకారిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగరాజు, భజన మండలి అధ్యక్షులు మల్లిఖార్జున, సభ్యులు రామాంజనేయులు, శ్రీనివాసులు, అమరేశ్, దిక్కెన్న, వెంకటేశ్, లక్ష్మీ నారాయణ, లక్ష్మయ్య, జమ్ములయ్య, భాగవత సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైల్వేల ప్రవేటికరణను ఆపాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సిఐటియు నిరసన

ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 29:

రైల్వే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, రైల్వే ల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, రైల్వే స్టేషన్లను పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు అప్పగించరాదని, రైల్వే కాంట్రాక్టు కార్మికులను తీసుకోవడంలో కాంట్రాక్టులు అక్రమాలకు పాల్పడుతున్నారని వాటిని అరికట్టాలని, రైల్వే గూడ్ షెడ్ లో పనిచేసే హమాలీ కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ నంద్యాల రైల్వే స్టేషన్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ , కే మహమ్మద్ గౌస్, కోశాధికారి వెంకట లింగం లతోపాటు రైల్వే గూడ్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాధవ, పెద్దన్న, ఆంజనేయులు లతోపాటు 100 మంది కార్మికులు పాల్గొనడం జరిగింది.

అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు బేబర్ కోడ్లను రద్దు చేయాలి. ప్రస్తుతము ఉన్న చట్టాలను మార్చొద్దు, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులనందరిని రెగ్యులరైజ్) క్రమబద్ధీకరించాలి. కాంట్రాక్టర్స్ మారినా కార్మికుల నందరిని పనులో పెట్టుకోవాలి కార్మికులనెవరిని తొలగించరాదు. టెండర్ ఎగ్రిమెంట్స్ కాంట్రాక్టర్స్ మరినా కార్మికుల నెవరిని తొలగించరాదనే నిబంధనలను ఖచ్చితంగా పొందుపర్చాలి. కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత కాపాడాలి. కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసును 60 సం? వర్కు కొనసాగించాలి. కేంద్ర కార్మిక శాఖ కమీషనర్ ఆర్డర్స్ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకందరికీ కనీస వేతనాలు ఖచ్చితంగా చెల్లించాలి. కాంట్రాక్ట్ కార్మికులకందరికి అపాయింట్ మెంట్స్ లెటర్స్ (నియామక పత్రాలు) ఇవ్వాలి, రైల్వేయజమాన్యం ద్వారా కాంట్రాక్ట కార్మికులకందరికి సరైన గుర్తింపుకార్డులు ఇవ్వాలి. కాంట్రాక్ట్ కార్మికులకందరికి టైము ప్రకారం జీతాలు చెల్లించాలి. ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి. రైల్వేయజమాన్యమే టైం ప్రకారం జీతాలు చెల్లించే బాధ్యత వహించాలి. ప్లే స్లిప్పులు: ప్రతి నెలా వేతనాల వివరాలు తెలిపే పేస్లిప్పులను కాంట్రాక్ట్ కార్మికులకందరికి సప్లైచేయాలి. కాంట్రాక్టర్ యొక్క సంతకంతో పాటు సంబంధిత రైల్వే అధికారులయొక్క కౌంటర్ సంతకం ఖచ్చితంగా చేసి ఇవ్వాలి. జీతాల్లో అక్రమంగా కోతలు విధించరాదు. ఆక్రమపద్ధతులు, కార్మిక వ్యతిరేక చర్యలు చేపడుతున్న కాంట్రాక్టర్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్ట్ కార్మికులందరికి పి.ఎస్. ఇ.ఎస్.ఐ. సౌకర్యాలను ఖచ్చితమంగా అమలుపర్చాలి. పిఎఫ్, ఇఎలకై జమచేసిన సొమ్ములపై కాంట్రాక్టర్స్ యొక్క అవకతవకలు, మోసాలను అరికట్టాలి. అవకతవకలను మోసాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్ట్ కార్మికులకందరికి బోనస్, వర్కమెన్ కాంపన్సేషన్ (ప్రమాదాలు జరిగితే ఇచ్చే నష్టపరిహారం), ప్రసూతి శలవులు తదితర సాంఘిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి. ప్రిన్సిపాల్ ఎంప్లాయిస్గా ఉన్న రైల్వే యజమాన్యమే పై వన్ని అమలు అయ్యేటట్లు బాధ్యత వహించాలి. పనిప్రదేశంలో మహిళా కార్మికులపై లైంగిక వేధింపు చర్యలను అరకట్టాలి, మహిళా కార్మికులపై దుర్భాషలు, లైంగిక వేధింపులు, బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. పనిప్రదేశంలో మహిళా కార్మికులపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ఖచ్చితంగా అమలుపర్చాలి. అంతర్గత కంప్లెంట్ కమిటీలను ఏర్పాటుచేయాలి. వర్కా షాపులు, స్టేషన్స్, గూడ్సెషెడ్స్, బాక్సాయిస్, వివిధ యార్డులు తదితర చోట్ల పనిచేస్తున్న కార్మికులకందరికి సరియైన -ఆరోగ్య కరమైన పరిస్థితులు కల్పించాలి. విశ్రాంతి గదులు, త్రాగునీరు, మహిళా కార్మికులకు డ్రస్సింగ్ రూమ్స్ తదితరమైన వాటిని కల్పించాలి. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు చట్టపరమైనవన్నీ కల్పించడానికై 2005 నుండి నేటివర్కు రైల్వేబోర్డు ద్వారా ఇచ్చిన ఆర్డర్ను అమలుపర్చాలి. ద.మ. రైల్వే, మరియు ఈ.కో-రైల్వేలో కాంట్రాక్ట్ వర్కర్స్ సర్వీసును 50 సం? వరుకు పరిమితంగా విధించిన వయోనిబంధనల రైల్వేఆర్డర్స్ ను వెంటనే ఉపసంహరించుకోవాలి. కాంట్రాక్ట్ కార్మికులందరికీ సంవత్సరానికి 9 రోజులు క్యాజువల్ లీవ్స్, 19 రోజులు నిర్నిద్ లీవ్స్ ఇవ్వాలి. వారాంతపు సెలవులు (వీక్లీ రెస్ట్) ల్లోను, ప్రభుత్వశెలవు దినాల్లోనూ పనిచేసిన కాలానికి రెట్టింపు వేతనాభివ్వాలి. జీతంతో కూడిన వారాంతపు శలవులు మంజూరు చెయ్యాలి. కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య తగ్గించొద్దు, ద.మ. రైల్వే, ఈ, కో రైల్వేలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య కుదించాలని ఉద్యోగాల నుండి తొలగించాలని రైల్వేవారు ఇచ్చిన ఆర్డర్ను వెంటనే వెనక్కి తీసుకోవాలి.



# పద్మావతి నగర్ సొసైటీ పై

# అన్నదమ్ముల పంచాయతీ

- అన్నా తమ్ముళ్లు పోటా పోటీగా ప్రెస్ మీట్లు. -రాముడు లక్ష్మణుడు శత్రుఘ్నులు ఒకవైపు.

-భరతుడు అతని కుమారుడు శశి ఒకవైపు. - ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు.

-తల్లి స్థలాన్ని భరతుడు కాజేశారని లక్ష్మణ్ ఆరోపణ. -నా స్థలాన్ని మరొకరికి రాసిచ్చారు సాయి కృష్ణ.


-నా ఖాళీ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర పడుతున్నారు సాయి కృష్ణ.

-సొసైటీ నిబంధనల ప్రకారం ప్రకారం నడుచుకుంటున్నాం అధ్యక్షులు

-అన్నదమ్ములు ఒకరిపై మరొకరు సవాల్.

-నాకు న్యాయం చేయాలంటున్న శోభ లాడ్జి రాఘవేంద్ర స్వామి. - అన్నదమ్ముల వివాదం సొసైటీ సభ్యుల్లో ఆందోళన.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 29:
పద్మావతి నగర్ సొసైటీ పై అన్న తమ్ముళ్లు అయినా రాముడు లక్ష్మణుడు శత్రుఘ్నులు పట్టణంలోని శశి హోటల్లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయగా , భరతుడు అతని కుమారుడు శశి కలిసి శ్రీనివాస్ నగర్ లోని సొసైటీ కార్యాలయంలో శనివారం వేరువేరుగా పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఇరువురి పాత్రికేయుల సమావేశం తో శ్రీనివాస హౌసింగ్ సొసైటీ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. పద్మావతి మరియు సుబ్బరాయుడుల కుమారులైన శ్రీరాములు, లక్ష్మణస్వామి, భరతుడు, శతృఘ్నుడులు రెండు వర్గాలుగా చీలిపోయారు. భరతుడు మరియు సొసైటి అధ్యక్షుడైన కుమారుడు శశిధర్ ఒక వైపు నిలవగా, శ్రీరాములు కుమారుడు సాయికృష్ణ, లక్ష్మణస్వామి, ఆయన కుమారుడు పవన్ కుమార్, శతృఘ్నుడు ఒక వైపు నిలిచారు. ఇరువర్గాలు పాత్రికేయుల సమావేశాల్లో ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. సొసైటీ చట్టం ప్రకారం నడుచుకుంటున్నామని భరతకుమార్ వర్గం చెబుతుండగా, ఉమ్మడి కుటుంబం ఆస్తిని భరతుడు ఆయన కుమారుడు శశి కాజేస్తున్నారని లక్ష్మణస్వామి వర్గం ఆరోపిస్తుంది. ఇరువర్గాలు పద్మావతి నగర్ సొసైటీ లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేసుకున్నారు .ఈ సందర్భంగా లక్ష్మణుడు మాట్లాడుతూ మాలోని ఒకరైన భరత్ కుమార్ మా ఉమ్మడి ఆస్తిని అందరికీ సమానంగా పంచ కుండా తనదేనని చెపుతున్నారని అన్నారు.మా తల్లిగారైన వెంకట లక్ష్మమ్మ కు పద్మావతి నగర్ లో అప్పట్లో అందరము కలిసిఅమ్మ పేరుమీదే పద్మావతి నగర్ సొసైటీలో ఒక స్థలం కొన్నామని అన్నారు. రిలియన్స్ ట్రెండ్ వద్ద అమ్మ పేరున ప్లాట్ రిజిస్టర్ నంబర్ 1238 నంబర్ 24 డిప్పులో కేటాయించారని అన్నారు.ఆ స్థలం అందరూ సమానంగా పంచకుండా కటకం భరత్ ఒక్కరే ఇది నా ఆస్తి ఎవరికి పంచను అంటూ ఆయన కుమారుడు శశిధర్ పేరున రిజిస్ట్రేషన్ చేయించడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు.మా అమ్మ భరత్ పేరుమీదే రాసిందని,మా అమ్మకు సంతకం రాదని వేలిముద్ర మాత్రమే రావడంతో దొంగ సంతకాలు సృష్టించారని ఆరోపించారు.న్యాయం చేయాలని కోరారు. లక్ష్మణుడు కుమారుడు సాయి కృష్ణ మాట్లాడుతూ మా నాన్న నాకు పద్మావతి నగర్ సొసైటీ లో దాదాపు 6 సెంట్ల స్థలం ఉండేదని అయితే ఆ స్థలాన్ని నా పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించారని, కానీ నాకు తెలియకుండా ప్రస్తుతం సొసైటీ అధ్యక్షులు శశిధర్ నా అనుమతి,అంగీకారం లేకుండా ఆయన బావ సునీల్ కు నా స్థలం రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు.ప్రస్తుతం నా పేరు మీద వున్న ఖాళీ స్థలానికి మున్సిపాలిటీలో పన్నులు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.వారికి ఎలాంటి అంగీకార పత్రం ఇవ్వకపోయినా నా స్థలం మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.శోభా హోటల్ యజమాని రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ 1996 లో నా తండ్రి అనంత కృష్ణమాచారి సొసైటీలో డబ్బు కట్టి డిప్పు లో 55 నంబర్ ప్లాట్ కేటాయించినా నేటి వరకు ప్లాటు ఇవ్వకుండా భరతుడు నా ఆరోగ్యం భాగలేదు అని,అపుడు ఇస్తాను,ఇప్పుడు ఇస్తానని దాటవేస్తున్నరని ఆరోపించారు. అయితే ఆ స్థలానికి సంబంధించి డబ్బు కట్టిన రసీదులు వున్నాయని అన్నారు.మాకు కేటాయించినా స్థలం అక్షర డిగ్రీ కళాశాల ఎదురుగా వుందని అన్నారు.మరో బాధితుడు పవన్ కుమార్ మాట్లాడుతూ సొసైటీ లోని అప్పటి కార్యదర్శి దాట్ల నారాయణ రెడ్డి హయాంలో 257 ప్లాట్ నంబర్ లో వున్న స్థలాన్ని కొనుగోలు చేశానని అన్నారు.ప్రస్తుతం ఆ స్థలం ఖాళీ వుండడంతో సొసైటీ నుంచి నాకు బైలా ప్రకారం ఇల్లు కట్టుకొకపోవడంతో మరొకరికి ఈ స్థలాన్ని ఇస్తున్నట్లు నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు.సొసైటీ లో ఎన్నో స్థలాలు ఖాళీ వున్న నా పైన మాత్రమే కక్షతో ఇలా చేస్తున్నారని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.సొసైటీ కి నేను రాసిచ్చినట్టు రుజువులు చూపించాలని డిమాండ్ చేశారు.సొసైటీ ఆరంభం నుంచి ఇలాంటి నిభందనలు లేవన్నారు.సొసైటీ కి సంభందించిన డాక్యుమెంట్లు దాచిపెట్టి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. నిజా నిజాలు తెలియాలంటే సొసైటీ లోని పెద్దలలో పాటు డాక్యుమెంట్ తీసుకొస్తే అన్నీ విషయాలు బయటపడతాయని అన్నారు. దివంగత సుబ్బరాయుడు కుమారుల మధ్య తలెత్తిన ఆస్తి వివాదం పద్మావతినగర్ సొసైటి పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. తమ తల్లి వెంకటలక్ష్మమ్మ పేరు మీద ఉన్న 16 సెంట్ల స్థలాన్ని భరతుడు ఆయన కుమారుడు, ప్రస్తుత అధ్యక్షుడు శశిధర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారన్నారు. తల్లి ఆస్తి నలుగురికి హక్కు ఉంటుందని ఒక్కరే ఎలా రిజిస్టర్ చేసుకుంటారని ప్రశ్నించారు. తన తల్లి వేలిముద్రను ఫోర్జరీ చేశారని ఆరోపించారు. పెద్దన్న శ్రీరాములుకు చెందిన 259 ప్లాటును ఆయన తన కుమారుడికి రిజిస్ట్రేషన్ చేశారన్నారు. సాయికృష్ణ, సభ్యత్వాన్ని రద్దు చేసి ఆ ప్లాటు భరత్ కుమార్ అల్లుడు, కుమార్తె హిమబిందు భర్త గుండా సుధీర్ సిరిలు రిజిస్టర్ చేశానన్నారు. లక్ష్మణస్వామి కుమారుడు పవన్ కుమార్ తో పాటు సాయికృష్ణ, సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి మాతో ఎలాంటి సంప్రదింపులు జరుపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఫోర్జరీ సంతకాలను చేసి ఉమ్మడి ఆస్తిని కాజేస్తున్నారని ఆరోపించారు. 259 రిజిస్టర్ ఉండగానే మరొకరి పేరిట ఎలా రిజిస్టర్ చేస్తారని ప్రశ్నిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై మాకు ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. భరత్ కుమార్ ఆయన కుమారుడు



శశి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చట్ట ప్రకారమే నడుచుకుంటున్నామన్నారు. అభివృద్ధిలో భాగంగా రైతులు స్వచ్ఛందంగా తమ పొలాలను ఇచ్చారని, ప్లాట్లు పొందిన వారు ఇళ్ళు కట్టుకోకుండా వ్యాపారం చేస్తున్నారని సంచలన ఆరోపణ చేశారు. సొసైటి చట్టంలో ఏడాదిన్నరలో నిర్మాణం జరుపకపోతే. సొసై స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుందన్నారు. సొసైటీపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. సాయికృష్ణ, వెంకట లక్ష్మమ్మలు తమకు సభ్యత్వం వద్దని రాసి ఇచ్చారని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు కోర్టు ద్వారా నోటిసులను పంపించామన్నారు. ప్రస్తుతానికి ముగ్గురు సభ్యులు తమకు కేటాయించిన స్థలాలు మాకు వద్దని రాసిచ్చారన్నారు. సాటిపై వస్తున్న ఆపోహలు నమ్మవద్దన్నారు. ఆయా ప్లాట్లను సొసైటీ సభ్యులకే కేటాయిస్తామన్నారు. పద్మావతినగర్ సొసైటిలో 576 ప్లాట్లను డిప్లో వేశామన్నారు. ఖాన్ ప్లాట్లు ఏనీ లేవన్నారు. సొసైటి బాధితుడు రాఘవేంద్ర మాట్లాడుతూ తన తండ్రి అనంత కృష్ణమాచార్యులు సొసైటిలో సభ్యత్వం ఉందని డిప్ సమయంలో ఆయనకు 55వ ప్లాట్ వచ్చిందని, జిఎనెంబర్ 179 సీరియల్ నెంబర్ 92గా సొసైటీ రికార్డుల్లో నమోదు అయిందన్నారు. 2002 నుంచి
ప్లాటు తమకు రిజిస్టర్ చేయాలని అప్పటి అధ్యక్షుడు భరత్కుమారు కోరుతున్నామన్నారు. 22 ఏళ్ళుగా రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. తాజాగా ఆ ప్లాను ఒకరికి కేటాయించినట్లు తెలిసిందన్నారు. తన తండ్రి సొసైటికి చెల్లించిన నగదు రిసిప్ట్ ను తీసుకొని రమ్మని భరత్ కుమార్ అద గుల తో వాటిని ఆయనకు ఇచ్చానన్నారు. రిజిస్ట్రేషన్ చేయాలని కోరినప్పుడల్లా చేస్తానని చెబుతూ వస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితుడు రాఘవేంద్ర ఆరోపణలపై భరతుడు మాట్లాడుతూ రాఘవేంద్ర ప్రస్థావిస్తున్న అంశాలన్నీ అవాస్తవమన్నారు. ఆయన వద్ద సొసైటిలో సభ్యత్వంతోపాయిల నగదు చెల్లించిన రిసిస్టు ఉంటే తప్పక రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. కెసి కెనాల్ దాసర్ ఆక్రమణపై ఆయన మాట్లాడురూ లే అవుట్లో దానల్ను చూపించలేదన్నారు. కెసి కెనాల్ను ఆక్రమించాల్సిన అవసరం సొసైటికి లేదన్నారు. 40 ఏళ్ళ క్రితం లే అవుట్ వేశానున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు.





## చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి.

ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 29:
చలో హైదరాబాద్ విశ్వరూప మహా సభను జయప్రదం చేయండి అని ఎంఎస్పి జిల్లా కో కన్వీనర్ మహానంది మండల ఇన్చార్జి పూల వెంకటసుబ్బన్న, ఎమ్మెస్పి జిల్లా నాయకులు నరసింహ అన్నారు. శనివారం మహానంది మండలం గోపవరం గ్రామంలోని హైస్కూల్ నందు ఆగస్టు రెండో వారం హైదరాబాదులో జరిగే విశ్వరూప మహాసభ ను జయప్రదం చేయాలని కోరారు.అనంతరం చలో హైదరాబాద్ విశ్వరూప మహా సభను జయప్రదం చేయండి అని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహానంది ఎంఎస్పి మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, శివ కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహరం పండుగ వేడుకలు.

ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 29:
మహానంది మండలం గాజులపల్లె, బసవపురం, గాజులపల్లె మెట్ట గ్రామాలలో పెద్ద సరిగెత్తు వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం ఉదయం నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు అగ్నిగుండం తొక్కుతూ మొక్కులు తీర్చుకున్నారు.భక్తులు స్వామివార్లకు పూల సూచికలు, కానుకలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



నిర్వహించుకున్నారు. రాత్రి నుండి ఉదయం వరకు స్థానికులు పెద్ద సరిగెత్తు పీర్ల ఊరేగింపు సందర్భంగా భక్తులు భారీసంఖ్యలో తరలిరావడంతో గ్రామం కిటకిటలాడింది.కులమతాలకు అతీతంగా మోహరం వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం సాయంత్రం ప్రజలందరూ కులమతాలకతీతంగా పీర్ల స్వాముల దగ్గరికి వెళ్లి బొరుగులు, చక్కెర, టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రంగురంగుల దట్టీలు, వెండి ఆభరణాలు, పూలగుమ్మటాలతో పీర్లను అలంకరించి బాజాలు,తప్పెట్ల నడుమ గ్రామేత్సవం నిర్వహించారు.పిల్లలు, పెద్దలు కోలాటాలు, ఆటపాటలతో దప్పుచప్పుళ్ల మధ్య పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. పీర్లను పురువీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు.

## ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూలై 29 :
ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ గ్రామ సర్పంచ్ దూదేకుల హుస్సేన్ బిగురప్ప సూచించారు. ఈ మేరకు శనివారం శిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ సంకల్పం-



ఆరోగ్య విషయాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారని గ్రామ సర్పంచ్ దూదేకుల హుస్సేన్ బి గురప్ప చెప్పారు.
ఈ కళాజాతాలో భాగంగా దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ, తడి పొడి చెత్తను వేరు చేయుట, యువకులు రక్తదానం చేయుట, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ, గ్రామ నాయకులు వంకదార సుబ్బా సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నగరంలో ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

... ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు వినోదం

.... ఎగ్జిబిషన్లో ప్రపంచంలోని ఏడు వింతలు ఏర్పాటు

ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా 29:
ఎగ్జిబిషన్ల ద్వారా నగర ప్రజలకు వినోదంతో పాటు ఆహ్లాదం చేకూరితోందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ గారు అన్నారు. శనివారం ఆయన నగరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈసారి ప్రత్యేకంగా ప్రపంచంలోని ఏడు వింతలను ఏర్పాటు చేశారు.అనంతరం మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పనుల్లో ప్రజలు బిజీగా ఉంటారని సాయంత్రం వేళల్లో కుటుంబం తో పాటు కొంత సేద తీరెందుకు ఎగ్జిబిషన్లు ఉపయోగపడతాయని అన్నారు. వయసు తో నిమిత్తం లేకుండా ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ కు వచ్చి సంతోషం లో మునిగి తెలుతారని అన్నారు. చిన్న పిల్లలకు ఎన్నో రకాల అందమైన అట పరికరాలు, జెంట్ వీలు వంటి వి ఏర్పాటు చేశారు అని తెలిపారు. అంతే కాకుండా రాకరకాల ఇంటికి పనికి వచ్చే వస్తువులు కూడా ఇక్కడ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రపంచంలో ఉన్న ఏడు అద్భుతాలను అక్కడ ఏర్పాటు చేశారన్నారు. తెలియని వారికి కూడా ఈ ఏడు వింతల గురించి తెలుసుకుంటారని అన్నారు. నెలరోజులు పాటు ప్రజలకు నిర్వాహకులు అందుబాటులో ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు, ముజీబ్ స్థానిక కార్పొరేటర్లు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# స్వాతంత్రోద్యమ నాయకురాలు శ్రీమతి అరుణా అసఫ్ అలీ గారి సేవలు చిరస్మరణీయం.

## -సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి

ఆంధ్ర ప్రగతి డోన్ జూలై 29: భారత స్వాతంత్రోద్యమ నాయకురాలు శ్రీమతి అరుణా అసఫ్ అలీ గారి వర్ధంతి సందర్బంగా మరియు సంఘ సంస్కర్త శ్రీ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారి వర్ధంతి సందర్బంగా
డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి అరుణా ఆసఫ్ అలీ గారి వర్ధంతి సందర్బంగా మరియు సంఘ సంస్కర్త శ్రీ ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గారి వర్ధంతి సందర్బంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు. వారిని స్మరించుకున్నారు.
ఈ సందర్బంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ
మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు
శ్రీమతి అరుణా అసఫ్ అలీ గారు జూలై 16, 1909 న హర్యానాలోని కాల్కాలో జన్మించింది. ఈమె కలకత్తాలోని గోఖలే స్మారక పాఠశాలలో



ఉపాధ్యాయురాలిగా పని చేసింది.
భారత స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్న నాయకురాలు. 1942లో గాంధీజీ జైలుకెళ్ళినపుడు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన మహిళ. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బొంబాయిలోని గవాలియా టాంకు మైదానంలో భారత జాతీయపతాకాన్ని ఎగురవేసిన మహిళగా చిరస్మరనీయురాలు. ఈమె ఉప్పు సత్యాగ్రహములో నిర్వహించిన బహిరంగ ప్రదర్శనలలో పాల్గొన్నది. ఈమెను దేశదిమ్మరి అనే అభియోగము మోపి బ్రిటిష్ వారుఅరెస్టు చేశారు. 1932లో తీహార్ జైల్లో రాజకీయ ఖైదీగా ఉండగా అరుణ జైల్లో రాజకీయ ఖైదీల పట్ల చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష నిర్వహించింది. ఈమె ప్రయత్నం ఫలితంగా తీహర్ జైల్లో రాజకీయ ఖైదీల పరిస్థితి మెరుగైంది. ఈమె1996 జూలై 29 న స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను అనుక్షణం స్మరించుకుంటూ మన స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.
2) ఈశ్వర చంద్ర విద్యాసాగర్ సెప్టెంబరు 26 – 1820 జన్మించారు. ఈయన బెంగాలీ కవి,విద్యావేత్త, తత్త్వవేత్త, పారిశ్రామిక వేత్త, రచయిత, అనువాదకుడు, సమాజ సేవకుడు. వితంతు వివాహాలు, మహిళల జీవనగతిని మెరుగు పరచడానికి విద్యాసాగర్ అలుపెరగని ఉద్యమాలు చేసిన మహనీయులు.అందరికీ విద్య నేర్పించాలని మహిళలను విద్యాభ్యాసానికి ప్రోత్సహించి జాగృతి పరచారు. విద్యాసాగర్ 1856లో వితంతు పునర్వివాహ చట్టం ప్రతిపాదించి దాని అమలుకు అన్నివిధాలుగా కృషిచేశాడు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ జూలై 29 – 1891 స్వర్గస్తులైనారు. ఇటువంటి మహనీయులను ఎల్లవేళలా స్మరించుకుంటూ విద్యార్థి దశ నుండే సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# ఘనంగా నిర్వహించిన గ్లోబల్ టైగర్ డే వేడుకలు.




ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 29:
పులుల సంరక్షణలో భాగంగా ప్రతి సంవత్సరం జూలై 29వ తేదీ గ్లోబల్ టైగర్ డే వేడుకలు జరుపుకుంటున్నామని శాసనమండలి సభ్యులు ఇషాక్ భాషా పేర్కొన్నారు. శనివారంక లెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో 50వ గ్లోబల్ టైగర్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీశైలం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి,అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు, డి.ఎఫ్.ఓ వినీత్ కుమార్, డిఎఫ్ఓ గారి సతీమణి రూపక్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు ఇషాక్ భాషా మాట్లాడుతూ 50వ గ్లోబల్ టైగర్ డే వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని... మనకున్న అడవులను ఏ విధంగా పరిరక్షించుకోవాలి, పర్యావరణాన్ని ఏ విధంగా సంరక్షించాలి... భవిష్యత్తులోని భావితరాలకు మనకున్న వన సంపదపై ఏ విధంగా అవగాహన కల్పించాలి తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత ఐదు రోజుల నుండి నంద్యాల అడవి డివిజన్ పరిధిలో అనేక కార్యక్రమాలు జరిగాయన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత అడవులను సంరక్షించే కీలకపాత్ర ఫారెస్ట్ అధికారులదేనన్నారు. మనకున్న నల్లమల్ల ఫారెస్ట్ ఎన్నో ఆయుర్వేద మొక్కలకు ప్రతీకన్నారు. ఈ ప్రాంతంలో దొరకని మొక్క అంటూ లేదని ఎమ్మెల్సీ అన్నారు. అలాగే నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఎన్నో శివాలయాలు అంతర్భాగంగా ఉన్నాయని తెలిపారు. మనకున్న వన సంపదను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆయన కోరారు.
శ్రీశైలం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ గతంలో అడవులు విపరీతంగా నరకబడి కొండలను తలపించేలా ఉండేవని... టైగర్ ప్రాజెక్ట్ ఏర్పడిన తర్వాత అటవీ అభివృద్ధికి ఫారెస్ట్ అధికారులు కీలక పాత్ర పోషించారని ఆయన ఈ సందర్భంగా వారిని ప్రశంసించారు. పర్యావరణం, ప్రకృతి అడవులతో ముడిపడి ఉన్నాయని మన ప్రాంతంలో చెట్లు సమృద్ధిగా పెరిగితే వాటి ఆధారంగానే వర్షాలు వస్తాయన్నారు. గత 15 సంవత్సరాల నుండి చూస్తే అటవీ ప్రాంతంలో పుల్లల సంఖ్య రెట్టింపు అయ్యాయని వాటిని సంరక్షించడంలో అటవీ అధికారులు బాధ్యత తీసుకోవడం అభినందనీయం అన్నారు.
డి.ఎఫ్.ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ 1973లో టైగర్ ప్రాజెక్ట్ ఏర్పాటై పులుల సంరక్షణకు రష్యాలో జరిగిన సమావేశంలో బీజం పడిందని ఆనాటి నుండి ప్రతీ ఏడాది జులై 29న గ్లోబల్ టైగర్ డే వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. దేశంలో 52 టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లు ఉన్నాయన్నారు. 5 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో నల్లమల అటవీ ప్రాంతం వుందని 1983 నుండి నాగార్జున శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కాబడి అటవీ సంరక్షణకు అనేక ప్రణాళికలు చేపట్టి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిఎఫ్ఓ గారి సతీమణి రూపక్ మాట్లాడుతూ అడవికి ఆయు పట్టు అయినటువంటి చెంచుల జీవన విధానాలను, వారు అడవికి చేసే సేవలను కొనియాడారు.
అనంతరం గత ఐదు రోజుల నుండి నంద్యాల అటవీ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి వివిధ రేంజ్ ల లోని పాఠశాలలోని విద్యార్థుల చేత నిర్వహింపబడిన డ్రాయింగ్, వ్యాసరచన, వకృత్వ క్విజ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు, అటవీ సంరక్షణలో ప్రతిభ కనబరిచిన అటవీ అధికారులకు బహుమతి ప్రశంసా పత్రాలు అతిధులు అందజేశారు.




# రాజకీయం అంటే ప్యాకేజీ కాదు ప్రజా సేవ.

## -ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్.



ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా 28:
రాజకీయమంటే ప్యాకేజిలు కాదు ప్రజాసేవ.. అని చంద్రబాబు స్క్రిప్ట్ లు చదివే పవన్ కు రాజకీయాలు అబ్బలేదని.. సీఎం జగన్ సంక్షేమ పాలన ప్రభావంతో వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఇంటికే పరిమితం కానున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి చేశామని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ తెలిపారు. ఇందుకే వచ్చే ఎన్నికల్లో 175కి 175 సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నామన్నారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 70 వేల మందికి పైగా సర్టిఫికెట్లను అందించామన్నారు. ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా సేవలను అందించామని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ తోనే పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ పార్ట్ టైం పొలిటీషియన్ తప్ప ప్రజల సమస్యలను తెలుసుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు ఇంటికే పరిమితం చేస్తారని చెప్పారు.



# పులుల సంరక్షణ పై అవగాహన ర్యాలీ,

ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామంలో అంతర్జాతీయ పులుల దినోత్సవంలో భాగంగా డిప్యూటీ డైరెక్టర్ గిద్దలూరు వారి ఆదేశాలననుసరించి %ఖీ=ూ ు%. జీవన్ కుమార్ సిబ్బందితో ఈ రోజు ప్రపంచ పులుల దినోత్సవం లో భాగంగా దిగువమెట్ట గ్రామం లో పులుల సంరక్షణ పై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్య పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో D.Vamsi krishna Dy.R.O, FSO , FBO మరియు దిగువమెట్ట సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన మొహరం వేడుకలు



తుగ్గలి:–మత సామారస్యాలకు ప్రతీకగా మొహరం వేడుకలు అంగరంగ వైభవంగాజరిగాయి. మండలపరిధిలోని వివిధ గ్రామాల్లో మొహరం వేడుకలు భక్తులు మూడు రోజులు అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకొన్నారు. శనివారం పీర్ల స్వాములు ఏటికి పోవడంతొ మొహరం వేడుకలు ఘనంగా ముగిసాయి. పీర్ల చావిడి ముందు తీసిన అగ్ని గుండంను పూడ్చివేశారు. భక్తులు పీర్ల స్వాములకి బెల్లం, చెక్కెర,వెండి, బంగారు గొడుగులు, నూతన వస్త్రాలు,పూలమాలలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మేళతాలాలు,డప్పువాయిద్యాలతొ పీర్ల స్వాములను సాగనంపారు. ఈసందర్బంగా భక్తులు నిండు బిందెలతో వార్పు వేశారు. బంతి పూలు వేస్తూ వీడ్కోలు పలికారు. పీర్ల స్వామి గ్రామ ప్రజలకు భవిష్యవాణి వినిపించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డియస్పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ రామకృష్ణరెడ్డి ల ఆధ్వర్యంలో తుగ్గలి, జొన్నగిరి, మద్దికేర యస్ఐ లు మల్లిఖార్జున, రామాంజినేయులు, రిజ్వాన్ భాష్ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

# ఉచిత సబ్సిడీ పద్ధతిలో జమాయిల్ చెట్లు పంపిణీ




తొట్టంబేడు మండలంలోని రౌతు సురమాల వద్ద ఉన్న గ్రీన్ ప్యానెల్ కంపెనీ వారు ఉచిత సబ్సిడీ పద్ధతిలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. గ్రీన్ ప్యానెల్ కంపెనీ టెక్నికల్ పరిజ్ఞానంతో బీడు బంజరు భూములు ఇసుక ఎర్ర నేలలు సునాయాసంగా పెరిగే క్లోనింగ్ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కాండం నిటారుగా ప్రక్క కొమ్మ లేకుండా అతి తక్కువ పెట్టుబడి తో ఎక్కువ కలప దిగుబడి ఇచ్చే నీలగిరి మొక్కలను కంపెనీ నుండి ఐదు కిలోమీటర్ల పరిధి దాటిన రైతులందరికీ సబ్సిడీ పద్ధతిలో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రైతులందరికీ మొక్కలు ఉచితంగా అందిస్తున్నారు. కంపెనీ నుండి 100 కిలో మీటర్ల పరిధిలో ఉన్న గ్రీన్ ప్యానెల్ కంపెనీ మద్దతు తో ఖాలి గా ఉన్న వృధా భూములను సాగులోఖి తీసుకురావడం ద్వారా కుటుంబ వలసలను తగ్గించడంలో పారం పారస్ట్రీకీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రయత్నం పేద సన్నకారు రైతులను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుందని మొక్కలు కావాల్సిన వారు 9100 888676,8700 493301 నంబర్ల లలో సంప్రదించ లని కోరారు.

# ముక్కంటి సేవలో

# ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్



శ్రీకాళహస్తి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దేవరకొండ శాసనసభ్యులు రవీంద్రకుమార్ నాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఏపీ డిప్యూటీ ఛైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. రవీంద్రకుమార్ నాయక్ మొదట రూ. 5వేలు ప్రత్యేక రాహు–కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇఛ్చారు. ఆలయ ఏఈవో సతీష్ మాలిక్ వీరికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు